Follow: @ANNTELUGU
REGISTERED NUMBER APTEL/2014/58382
19-03-2026
ANN తెలుగు
# మహా పత్రిక
తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 81 పేజీలు-04 వెల-రూ.6
PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM

తెలుగు ప్రజలందరికీ మహా పత్రిక యాజమాన్యం తరుపున పరాభవ నామ సంవత్సర ఉగాది శుభాకాంక్షలు

టాప్ న్యూస్

## అన్న అనే పేరుకే కళంకం
- జగన్‌పై షర్మిల నిప్పులు



02

## డాలర్ జోరు
- రూపాయి బేజారు



02

## పాలిటిక్స్ లోకి వస్తా...
- నారా రోహిత్ క్లారిటీ



02




ప్రత్యేక కథనం 4లో

# 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు



## తెలంగాణకు 2028లో జరగవు

మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే బెయిల్

ఢిల్లీలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి

అసెంబ్లీకి కేసీఆర్ రావాలి.. సూచనలు, సలహాలు ఇవ్వాలి

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపిన సీఎం రేవంత్

**ఢిల్లీ, మహా :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు 2028లో జరిగే అవకాశం కనిపించడం లేదని, జాతీయ స్థాయి పరిణామాలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి అంశాల నేపథ్యంలో 2029లోనే ఎన్నికలు జరిగే సూచనలు ఉన్నాయని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఢిల్లీలో మీడియాతో చిట్ చాట్ చేసిన సీఎం "మొయినాబాద్ డ్రగ్స్ కేసులో నిబంధనల ప్రకారమే స్టేషన్ బెయిల్ ఇచ్చారు. దీనిలో మా ప్రమేయం ఏమీ లేదు. ఈ వ్యవహారంపై దర్యాప్తునకు సిట్ వేశాం" అని చెప్పారు. 2029లోనే తెలంగాణలో ఎన్నికలు జరుగుతాయని సీఎం అన్నారు. 2028లో ఎన్నికలు రావని చెప్పారు. మహిళా రిజర్వేషన్లు ముందుగా అమల్లోకి వస్తే మంచిదేనని అభిప్రాయపడ్డారు. అంతకుముందు పార్లమెంట్‌లో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకా గాంధీలను రేవంత్‌రెడ్డి కలిశారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్‌తో కలిసి వెళ్లి వారితో సమావేశమయ్యారు. ఇటీవల రాజ్యసభకు ఎన్నికైన వేం నరేందర్‌రెడ్డిని రాహుల్, ప్రియాంకలకు రేవంత్ పరిచయం చేశారు.

మిగతా 2లో



# త్రిష చుట్టూ తమిళ పాలిటిక్స్

అమిత్ షాతో భేటీ అయిందని వార్తలు

పొత్తులపై తేల్చిచెప్పిన టీవీకే చీఫ్ విజయ్

అయినా.. ఆగని వదంతులు..

పళనిస్వామి తనయుడితోనూ భేటీ ప్రచారం

చెన్నై, మహా: తమిళ రాజకీయాలు ఇపుడు స్టార్ నటి త్రిష చుట్టూ తిరుగుతున్నాయి. త్రిషకు సంబంధం ఉన్నా లేకపోయినా రాజకీయ నాయకులు, తమిళ మీడియా త్రిష చుట్టూ తమిళ పాలిటిక్స్ ను తిప్పుతోంది. అటు డీఎంకే, ఇటు అన్నాడీఎంకే నేతలు పలుమార్లు త్రిషపై వ్యాఖ్యలు చేయగా, ఇపుడు తమిళ రాజకీయం అంతా సినీనటి త్రిష చేతుల్లో ఉందని రాజకీయ వర్గాల్లో పెద్దఎత్తున ప్రచారం జరుగుతోంది. ఈ ఎన్నికల్లో పాలక డీఎంకేదే పైచేయి అని, విపక్ష ఎన్‌డీఏపై 5 శాతం ఓట్ల ఆధిక్యంతో ఉందని.. ప్రముఖ సినీ నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీకి 15 శాతం ఓట్లు రావచ్చని పలు సర్వేలు అంచనా వేసిన నేపథ్యంలో.. ఎన్‌డీఏ నేతలు అప్రమత్తమయ్యారు. విజయ్‌ను తమ వైపు తిప్పుకొనేందుకు అనేక రకాలుగా ఎత్తుగడలు అవలంభిస్తున్నారు. జననాయగన్ కు ఇబ్బందులు, కరూర్ తొక్కిసలాట ఘటన వ్యవహారంలో విజయ్‌తో సీబీఐ విచారణ వంటి అంశాలు, విజయ్ విడాకుల కేసు వంటివన్నీ ఒకటితర్వాత ఒకటి దాడిచేస్తున్నాయి. ఈ క్రమంలో విజయ్ సన్నిహితురాలు త్రిష గత వారం ముంబైలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో భేటీ అయినట్లు చర్చ జరుగుతోంది. ఆ తర్వాత ఈ నెల 15న సీబీఐ విచారణకు హాజరైన విజయ్.. ఎలాంటి ఇబ్బందీ లేకుండా బయటకు వచ్చినట్లు రాజకీయ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అంతేగాక సెన్సార్ బోర్డు సైతం విజయ్ సినిమాను పునఃపరిశీలించేందుకు తాజాగా అంగీకరించినట్లు తెలుస్తోంది. త్రిష కృషి వల్లనే ఇది సాధ్యమైందని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఇంకోవైపు.. అన్నాడీఎంకే అధినేత పళనిస్వామి కుమారుడు మిథున్ కూడా పలు మార్లు త్రిషతో సమావేశమైనట్లు ప్రచారం జరుగుతోంది. ఇదంతా బీజేపీ వ్యూహాత్మక ప్రచారమని, బీజేపీతోనే కాదు ఎవరితోనూ పొత్తుల ప్రసక్తేలేదని టీవీకే వర్గాలు తేల్చిచెబుతున్నాయి. విజయ్ కూడా పొత్తులపై బుధవారం సంచలన ప్రకటన చేశారు. 234స్థానాలకు అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. అయితే పాలిటిక్స్ లో ఏదైనా జరగొచ్చు. తెరపైకి కనిపించేవి వేరు.. తెర వెనుక జరిగే వ్యూహాలు వేరుగా ఉంటాయని, ఏది నిజమని అబద్ధమని చెప్పలేమని కాలమే చెబుతుందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## సీఎం రేవంత్‌కు రోజా షేక్ హ్యాండ్

పార్లమెంట్ లాబీలో నేతల పలకరింపులు



వివరాలు 2లో

## 100 ఇండస్ట్రియల్ పార్కులకు గ్రీన్ సిగ్నల్!

కేంద్ర క్యాబినెట్ సంచలన నిర్ణయాలు

వివరాలు 2లో



# సీఎం రేవంత్ కు రోజా షేక్ హ్యాండ్

**పార్లమెంట్ లాబీలో నేతల పలకరింపులు**

**ఢిల్లీ, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఢిల్లీ పర్యటనలో ఓ వీడియో వైరల్ గా మారింది. వైసీపీ మాజీ మంత్రి రోజా పార్లమెంట్ లాబీల్లో సీఎం రేవంత్ కు ఎదురుపడ్డారు. రోజాకు మర్యాదపూర్వకంగా షేక్ హ్యాండ్ ఇచ్చిన రేవంత్ రెడ్డి, ఆమె యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. తాను పని మీద పార్ల మెంట్ కు వచ్చినట్లు రోజా తెలిపారు. ఆ తరువాత ఇద్దరూ అనంతరం అక్కడి నుంచి వెళ్లిపో యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రోజా, రేవంత్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో ఉన్నారు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ కు రోజా ఏపీలోని తన నివాసంలో ఆతిథ్యం ఇచ్చారు. ఈ విషయం పైన పలు సందర్భాల్లో కేసీఆర్ ను టార్గెట్ చేస్తూ.. సీఎం రేవంత్ పలు మార్లు సెటైర్లు వేసారు. అయితే ఇద్దరూ ఎదురుపడటంతో నవ్వుతూ పలకరించుకోవటం.. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది.

**నితిన్ గడ్కరీతో రోజా భేటీ**

వైసీపీ నేత ఆర్కే రోజా పార్లమెంట్ లో వైసీపీ ఎంపీలతో కలిసి కేంద్ర మంత్రి గడ్కరీతో సమావేశం అయ్యారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా తొలగించబడుతున్న 200 సంవత్సరాల ప్రాచీన ఆలయం విషయాన్ని ప్రాధాన్యంగా ప్రస్తావిస్తూ, అది నగరి చరిత్ర, సంప్రదాయం, భక్తి విశ్వాసాలకు ప్రతీకగా నిలిచిందని వివరించారు, దాని చారిత్రక ప్రాముఖ్యతను కాపాడే విధంగా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని గడ్కరీని కోరారు. అదేవిధంగా కొండ చుట్టూ మండపం ఏర్పాటు, నగరిలో పెరుగుతున్న రాకపోకలను దృష్టిలో ఉంచుకుని ఫ్లైఓవర్ నిర్మాణం అవసరం, పుత్తూరు ప్రాంతం లో జాతీయ రహదారి పనులు నెమ్మదిగా సాగడం, సరైన భద్రతా చర్యలు లేకపోవడం వల్ల జరుగు తున్న ప్రమాదాలు వంటి అంశాలను సమగ్రంగా వివరించారు. ప్రజల ప్రాణ భద్రత దృష్ట్యా ఈ సమస్యలను అత్యవసరంగా పరిగణించి తక్షణమే పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. మిథున్ రెడ్డితో పాటుగా గడ్కరీని కలిసిన రోజా వినతుల పై సానుకూలంగా స్పందించారు.

# 2029లోనే అసెంబ్లీ ఎన్నికలు

(మొదటిపేజీ తరువాయి)

గవర్నర్ ప్రసంగం ద్వారా రాష్ట్ర భవిష్యత్తు ప్రణాళికలు వివరించామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గవర్నర్‌తో చర్చించిన తర్వాతే ప్రసంగాన్ని తయారు చేశామన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో సీఎం మాట్లాడారు. ''రాజులు పోయినా.. రాజ్యాలు పోయినా.. రాచరికపు పోకడలు పోలేదు. కొందరు ఇంకా తమను తాము రాజులుగా భావిస్తున్నారు. నియంత పోకడలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారు. అధికారంలో ఉన్నప్పుడు అదే అహంకార ధోరణి.. లేనప్పుడూ అదే ధోరణి'' అని ప్రతిపక్షంపై మండిపడ్డారు. ప్రజాస్వామ్యంలో ప్రజలే నాయకులని పేర్కొన్నారు. ''కొత్త గవర్నర్‌ను కలిసేందుకు ప్రతిపక్ష నేత వస్తారనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం కూడా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతుందనుకున్నాం. గవర్నర్ ప్రసంగంపై సూచనలు, సలహాలు వస్తాయనుకున్నాం. ప్రధాన ప్రతిపక్షం నుంచి కనీస స్పందన రాలేదు. కేసీఆర్ సభకు రావాలని కోరుకుంటున్నాం. ఆయన సభలో పాల్గొని సూచనలు, సలహాలు ఇవ్వాలి. ప్రపంచ దిగ్గజ ఐటీ కంపెనీలు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యేందుకు మాజీ ప్రధాని పీవీ నరసింహారావు విధానాలే కారణం. పీవీ, నేదురుమల్లి జనార్దన్‌రెడ్డి తొలిసారి హైటెక్ సిటీకి పునాది రాయి వేశారు. అనంతరం చంద్రబాబు, వాజ్‌పేయి హైటెక్ సిటీని పూర్తి చేశారు. ప్రస్తుతం ఏఐ ద్వారా లక్షలాది ఉద్యోగాలు పోయి నిరుద్యోగ సమస్య తలెత్తే పరిస్థితి. ఈ పరిస్థితుల్లో మనం భవిష్యత్ ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉంది. సవాళ్లను ఎదుర్కోవడంపై విజన్ డాక్యుమెంట్‌ను సభలో ప్రవేశపెట్టాం. హైదరాబాద్‌లో నాలాలపై 28 వేల అక్రమ కట్టడాలు ఉన్నాయని గతంలో కేసీఆర్ అన్నారు. వాటిని నిర్దాక్షిణ్యంగా కూల్చాలని గతంలో కేటీఆర్ ఆదేశాలు ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కార్యాచరణనే కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. అని సీఎం తెలిపారు.

# వామ్మో దొంగ నోట్లు..!?

- పండగల పేరిట వివిధ పట్టణ వ్యాపార సముదాయాల్లో కొనుగోళ్లు
- ఎన్నికల ప్రచారంలో సైతం పంపిణీ... కూపి లాగుతున్న పోలీసులు



**మంచిర్యాల, మహా:** వామ్మో మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాలలో దొంగ నోట్లు..!? యదేచ్ఛగా చేతులు మారుతున్నాయి. సామాన్య ప్రజలు నిత్యవసర సరుకులు, ఇతరత్రా కొనుగోళ్లకు వెళ్లి సదరు వ్యాపారులు ఇచ్చిన డబ్బులు తీసుకోవాలంటే అనుమానాలు వ్యక్తం చేయవలసిన దుస్థితి నేడు నెలకొంది. నేడు చదువుకున్న యువతకు సరిపడా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో మంచివారు కూడా వారి వారి కుటుంబాలను, వివిధ అవసరాలను తీర్చుకోవాలంటే అక్రమ మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రం నుండి దేశవ్యాప్తంగా సంవత్సరానికి కోట్ల మంది విద్యార్థులు వివిధ విద్య కోర్సులలో అత్యుత్తమ ప్రతిభ నైపుణ్యాలు కనబరిచి ఉత్తీర్ణత సాధిస్తున్న విషయం తెలిసిందే. అయితే ఇలా ఉత్తీర్ణత సాధించిన చదువుకున్న యువతకు సరిపడా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో అక్రమ మార్గాలకు ఆకర్షితులవుతున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. స్థానిక ప్రజల సమస్యలను తీర్చడం కొరకు ప్రజల చేత ఎన్నుకోబడుతున్న సర్పంచ్, కౌన్సిలర్, మున్సిపల్ చైర్ పర్సన్, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పరిశ్రమల స్థాపన కొరకు ప్రభుత్వాన్ని వినతులు చేయకపోవడమే ఇందుకు ప్రధాన కారణమని తెలుస్తోంది. ఇలా వివిధ పదవులకు ఎంపికవుతున్న ప్రజాప్రతినిధులు స్థానిక ప్రజల సమస్యలను, అవసరాలను తెలుసుకోకపోవడం లేదు. ఇంజనీరింగ్ పీజీ చదివిన యువత నేడు వాచ్ మెన్, పెట్రోల్ బంక్ లో పని, వివిధ షాపింగ్ మాళ్లలో అతి తక్కువ జీతానికి విధులు నిర్వహిస్తూ భార్యా పిల్లలను, తల్లి తండ్రులను పోషించుకుంటున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా గత గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డ్ సభ్యులు, మునిసిపాలిటీ కౌన్సిలర్ల ఎన్నికలలో వివిధ పార్టీలకు ప్రచారం చేసిన వారికే కాకుండా ఓటుకు నోటులో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో విచ్చలవిడిగా దొంగ నోట్లు ఇంటింటికి చలామణి అయినట్లు పెద్ద ఎత్తున ప్రచారం సాగుతోంది. ప్రస్తుత రంజాన్ మాసం పండగను పురస్కరించుకొని కొంతమంది దుస్తులు, బియ్యం ఇతర సామాగ్రిలు కొనుగోలుకు మంచిర్యాల, లక్షట్టిపేట, బెల్లంపల్లి, ఆసిఫాబాద్, కాగజ్ నగర్ ఇతరాత్ర ప్రాంతాలలో ఖరీదు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ ముఠా దుస్తులు కొనుగోలుకు ముందుగా 6000 నుండి 10 వేల రూపాయల దాకా దుస్తులు ఇతర సామాగ్రిలు తీసుకొని డబ్బులు చెల్లించి ఆ తర్వాత 3 వేల రూపాయల సామాగ్రిని వాపస్ చేసి షాప్ యజమానులు ఇచ్చిన అసలు నోట్లను తీసుకొని చిత్తగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ముఠా ఒక్క షాపులోనే కాకుండా మరో కొన్ని షాపులలో వస్తువులు, దుస్తులు కొనుగోలు చేస్తూ దర్జాగా నోట్ల మార్పిడి చేస్తున్నట్లు సమాచారం. వీరు మంచిర్యాల, కొమరం భీం జిల్లాకు చెందిన వ్యాపార సముదాయాలను టార్గెట్గా చేసుకున్నట్లు తెలుస్తోంది. గత 18 రోజుల క్రితం లక్షెట్టిపేటలో పోలీసులు దొంగ నోట్ల మార్పిడి కేసును చేదించి 14 మంది దోషులుగా చేర్చి ఉమ్మడి అదిలాబాద్ జిల్లా కారాగారం కటకటాలకు పంపించిన విషయం తెలిసిందే. ఇదే కాకుండా మరికొన్ని ముఠాలు దొంగ నోట్ల చలామణి చేస్తున్నట్లు పోలీసు నిఘ వర్గాలకు పక్కా సమాచారం అందినట్లు తెలుస్తోంది. ఇప్పటికే నిఘా వర్గాలు పోలీస్ ఉన్నత స్థాయి అధికారులకు సమాచారం అందించారని సమాచారం. ఎలాగైనా ఈ ముఠాల గుట్టు లాగేందుకు ఇన్ ఫార్మర్ లను రంగంలోకి దింపి కూపి లాగుతున్నట్లు తెలుస్తోంది.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక అందరూ కచ్చితంగా అమలు చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**



**మంచిర్యాల, మహా:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని మంచిర్యాల జిల్లాలో కచ్చితంగా అమలు చేయాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య అధికారులకు ఆదేశించారు. బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలో 99 రోజుల కార్యాచరణ భాగంగా కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పారిశుధ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్, కార్యదర్శులకు సూచించారు. గ్రామంలోని వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాల వివరాలు తెలుసుకుని త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మిషన్ భగీరథ ద్వారా శుద్ధమైన త్రాగునీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ నీటి సరఫరా అధికారులకు చెప్పారు. రాయితీ గ్యాస్ సిలిండర్ సరఫరా, ఇందిరమ్మ ఇండ్లు పథకాల అమలు తీరును పరిశీలించారు. మండల కేంద్రంలోని అంగన్వాడి కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన 10వ తరగతి వార్షిక పరీక్ష కేంద్రాన్ని సందర్శించి పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించాలని, ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో త్రాగునీరు, వైద్య సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 100 ఇండస్ట్రియల్ పార్కులకు గ్రీన్ సిగ్నల్!

**కేంద్ర క్యాబినెట్ సంచలన నిర్ణయాలు**

**ఢిల్లీ,మహా:** దేశంలో పారిశ్రామిక రంగాన్ని పరుగులు పెట్టించేందుకు, ఉపాధి అవకాశాలను భారీగా సృష్టించేందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర క్యాబినెట్ బుధవారం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. దేశాన్ని గ్లోబల్ మాన్యుఫాక్చరింగ్ హబ్‌గా మార్చే లక్ష్యంతో నూతనంగా 'భారత్ ఔద్యోగిక్ వికాస్ యోజన' (భవ్య) అనే సరికొత్త పథకానికి కేంద్ర మంత్రివర్గం లాంఛనంగా ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద రాబోయే రోజుల్లో దేశవ్యాప్తంగా ఏకంగా 33 వేల 660 కోట్ల రూపాయల భారీ బడ్జెట్‌తో 100 'ప్లగ్ అండ్ ప్లే' ఇండస్ట్రియల్ పార్కులను ఏర్పాటు చేయనున్నారు. మౌలిక సదుపాయాల కల్పన, రైతుల సంక్షేమం, జాతీయ రహదారుల విస్తరణ వంటి బహుముఖ లక్ష్యాలతో క్యాబినెట్ ఆమోదముద్ర వేసిన ప్రాజెక్టుల పూర్తి వివరాలను కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వెల్లడించారు.

***భవ్య పథకం ...పారిశ్రామిక విప్లవానికి నాంది***

కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన 'భవ్య' పథకం దేశ పారిశ్రామిక ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేయనుందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. వంద నుంచి వెయ్యి ఎకరాల విశాలమైన పరిధిలో ఈ అత్యాధునిక ఇండస్ట్రియల్ పార్కులను నిర్మించనున్నారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు రంగం భాగస్వామ్యంతో (పీపీపీ మోడల్) ఈ భవ్య ఇండస్ట్రియల్ పార్కుల నిర్మాణం జరగనుంది. కేవలం పరిశ్రమలకు స్థలం కేటాయించడమే కాకుండా, వారు వెంటనే తమ కార్యకలాపాలను ప్రారంభించుకునేలా పూర్తి స్థాయి మౌలిక సదుపాయాలను ముందుగానే ఏర్పాటు చేయడం ఈ 'ప్లగ్ అండ్ ప్లే' విధానం ముఖ్య ఉద్దేశం. ఈ మౌలిక వసతుల కల్పన కోసం ఎకరాకు కోటి రూపాయల వరకు ఆర్థిక సాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందించనుంది. ప్లగ్ అండ్ ప్లే పద్ధతిలో అంతర్గత రహదారులు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థలు, నిరంతర విద్యుత్, ఇంటర్నెట్ నెట్‌వర్క్, కార్మికుల నివాస సముదాయాలు వంటి మౌలిక వసతులన్నింటినీ ముందుగానే నిర్మించి పెట్టుబడిదారులకు అందుబాటులో ఉంచుతారు. తద్వారా వివిధ శాఖల అనుమతులు, కరెంటు, నీటి కనెక్షన్ల కోసం ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన అవసరం లేకుండా వ్యాపార సంస్థలు వెంటనే తమ ఉత్పత్తిని ప్రారంభించే వీలు కలుగుతుంది. దేశంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ)తో పాటు భవిష్యత్ స్టార్టప్ సంస్థలకు ఈ పథకం ఒక వరంగా మారనుంది. సింగిల్ విండో క్లియరెన్స్ విధానం ద్వారా సులభతర వాణిజ్యాన్ని మరింత పారదర్శకంగా అమలు చేయడం దీని ప్రధాన లక్ష్యం.

**లక్షలాది ఉద్యోగాల సృష్టితో ఆర్థిక ప్రగతి**

మేక్ ఇన్ ఇండియా, ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమాలకు మరింత ఊతమిచ్చేలా ఈ భవ్య పథకాన్ని కేంద్రం డిజైన్ చేసింది. దేశవ్యాప్తంగా దాదాపు పదిహేను లక్షల ప్రత్యక్ష ఉద్యోగాలతో పాటు లక్షలాది పరోక్ష ఉపాధి అవకాశాలు ఈ పార్కుల ద్వారా యువతకు లభిస్తాయని అంచనా వేస్తున్నారు. పీఎం గతిశక్తి జాతీయ మాస్టర్ ప్లాన్ సూత్రాలకు అనుగుణంగా, జాతీయ రహదారులు, రైల్వే నెట్‌వర్క్‌లకు మల్టీమోడల్ కనెక్టివిటీ ఉండేలా ఈ పార్కులను తీర్చిదిద్దుతారు. హరిత ఇంధన వినియోగం, అధునాతన వ్యర్థాల నిర్వహణ వంటి పర్యావరణ అనుకూల విధానాలను ఇక్కడ పకడ్బందీగా అమలు చేయనున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ పార్కులను విస్తరించడం ద్వారా ప్రాంతీయ అసమానతలను రూపుమాపి, పారిశ్రామిక వికేంద్రీకరణ జరగాలని కేంద్ర ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉంది.

**పత్తి రైతులకు ఆసరాగా మద్దతు ధరల నిధి**

పారిశ్రామిక అభివృద్ధితో పాటు వ్యవసాయ రంగానికి, ముఖ్యంగా పత్తి పండించే రైతులకు కేంద్ర క్యాబినెట్ అండగా నిలిచింది. పత్తికి కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) కల్పించే కార్యకలాపాల కోసం ఏకంగా 1,718 కోట్ల రూపాయల భారీ నిధి కేటాయింపులకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. 202324 పత్తి సీజన్‌లో మార్కెట్ ధరలు కనీస మద్దతు ధర కంటే దిగువకు పడిపోయినప్పుడు, రైతులు తీవ్రంగా నష్టపోకుండా కాపాడేందుకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా ఈ నిధులను వెచ్చించనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న లక్షలాది పత్తి రైతుల ఆర్థిక ప్రయోజనాలను కాపాడటం, వారి ఆదాయ భద్రతను నిర్ధారించడం ప్రభుత్వ ప్రాథమిక బాధ్యత అని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. మార్కెట్ ఒడిదుడుకుల సమయంలో ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకోవడం వల్ల రైతులకు కొండంత భరోసా లభిస్తుందని వ్యవసాయ నిపుణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

**ఉత్తరప్రదేశ్‌లో భారీ హైవే ప్రాజెక్టుకు పచ్చజెండా**

మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో కీలకమైన జాతీయ రహదారి నిర్మాణానికి కూడా క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. యూపీలోని బారాబంకి నుంచి బహరాజ్ వరకు 101 కిలోమీటర్ల పొడవైన నాలుగు లేన్ల యాక్సెస్‌కంట్రోల్డ్ జాతీయ రహదారి నిర్మాణానికి కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ భారీ ప్రాజెక్టు కోసం కేంద్ర ప్రభుత్వం సుమారు 6,969 కోట్ల రూపాయలను ఖర్చు చేయనుంది. ఈ సరికొత్త హైవే నిర్మాణం పూర్తయితే ఆ ప్రాంతంలో ప్రయాణ సమయం గణనీయంగా తగ్గడమే కాకుండా, రవాణా, లాజిస్టిక్స్ రంగాలు ఊపందుకుంటాయి. స్థానికంగా ఆర్థిక, సామాజిక వృద్ధికి ఈ ప్రాజెక్టు కీలక ఉత్ప్రేరకంగా మారుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. పారిశ్రామిక కారిడార్లకు ఈ రహదారి మరింత మెరుగైన కనెక్టివిటీని అందించి, భవిష్యత్తులో దేశ ప్రగతి చక్రాలను మరింత వేగంగా తిప్పుతుందని కేంద్రం ఆశాభావం వ్యక్తం చేసింది.

# పాలిటిక్స్ లోకి వస్తా...

**నారా రోహిత్ క్లారిటీ**

**తిరుపతి, మహా:** టాలీవుడ్ నటుడు నారా రోహిత్ తన రాజకీయ రంగప్రవేశంపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అటు సినీ, ఇటు రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీశాయి. తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ తన భవిష్యత్ ప్రణాళికలపై స్పష్టతనిచ్చారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడి కుమారుడిగా, లోకేశ్ కు సోదరుడిగా రాజకీయ నేపథ్యం ఉన్నప్పటికీ... రోహిత్ ఇప్పటి వరకు సినిమాలకే పరిమితమయ్యారు. తాజాగా ఆయన మాట్లాడుతూ, "కచ్చితంగా రాజకీయాల్లోకి వస్తాను. కానీ దానికి ఇంకా సమయం ఉంది. సరైన సమయంలో నా రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తాను" అని తెలిపారు. ప్రస్తుతం తన పూర్తి దృష్టి సినిమాలపైనే ఉందని, వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను అలరించడమే తన మొదటి ప్రాధాన్యత అని వెల్లడించారు.

# డాలర్ జోరు.. రూపాయి బేజారు

**మహా :** అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి మారకం విలువ మరోసారి చరిత్రాత్మక కనిష్ఠానికి పడిపోయింది. బుధవారం ట్రేడింగ్‌లో రూపాయి విలువ 92.63 వద్ద ఆల్ టైమ్ కనిష్ఠ స్థాయిని నమోదు చేసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటం, దేశీయ మార్కెట్ల నుంచి విదేశీ నిధుల తరలింపు కొనసాగడం వంటి అంశాలు రూపాయిపై తీవ్ర ఒత్తిడిని పెంచాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ మార్కెట్‌లో ఈరోజు ఉదయం 92.42 వద్ద ప్రారంభమైన రూపాయి, ఆ తర్వాత మరింత బలహీనపడింది. మంగళవారం రూపాయి 92.37 వద్ద ముగిసిన సంగతి తెలిసిందే. కీలకమైన 92.50 స్థాయిని దాటి కిందకు పడటంతో అమ్మకాల ఒత్తిడి పెరిగిందని, దీనికి తోడు బ్యాంకు సెలవుల కారణంగా డాలర్ల లభ్యత తక్కువగా ఉండటం కూడా రూపాయి పతనానికి కారణమైందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ రీసెర్చ్ అనలిస్ట్ దిలీప్ పర్మార్ వివరించారు. దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ భారీగా ఉందని ఆయన తెలిపారు.



# సేంద్రీయ వ్యవసాయంతోనే ఆరోగ్యం

**బెల్లంపల్లి ,మహా:** సేంద్రియ వ్యవసా యంతోనే మెరుగైన ఆరోగ్యం ప్రజలకు కలుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారిణి సురేఖ పేర్కొన్నారు. జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్ లో భాగంగా తాండూర్ మండలంలోని గోపాల్ నగర్ గ్రామం ఎంపిక చేయడం జరిగింది .అందులో భాగంగా జిల్లా వ్యవసాయ అధికారి ఈ .సురేఖ గోపాల్ నగర్ గ్రామపంచాయతీ ఆఫీస్ లో రైతులకు సేంద్రియ సాగు పద్ధతుల గురించి వివరించారు అందరికీ నేలలో సేంద్రీయ కర్బన శాతం తక్కువగా ఉందని కంపోస్ట్ ఎరువు పశువుల ఎరువులు కచ్చితంగా వాడుకోవాలని సూచించారు.అనంత రం రైతులకు కిట్స్ ,బుక్స్,ఐడి కార్డు, పెన్, బ్యాగ్, క్యాప్ లు పంపిణీ చేయడం జరిగింది.

# అన్న అనే పేరుకే కళంకం

**జగన్‌పై షర్మిల నిప్పులు**

**అమరావతి, మహా :** అన్న అనే పేరుకే జగన్ కళంకం అని వైఎస్ షర్మిల తీవ్ర వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో మీడియాతో మాట్లాడిన ఆమె వివేకా హత్య కేసులో సునీత, ఆమె భర్తపై అవినాష్ రెడ్డి ఆరోపణలు చేయడాన్ని ఖండించారు. వివేకానంద రెడ్డి హత్య ముమ్మాటికీ కడప ఎంపీ టికెట్ విషయంలోనే జరిగిందని షర్మిల స్పష్టం చేశారు. కడప ఎంపీ పదవికి అవినాష్ రెడ్డి సరికాదని, ఆయనకు టికెట్ ఇవ్వవద్దని వివేకా స్వయంగా నాతో చెప్పారని ఆమె గుర్తు చేశారు. వివేకా బతికి ఉంటే తన రాజకీయ భవిష్యత్తుకు అడ్డంకి అవుతారని భావించే అవినాష్ రెడ్డి ఈ ఘాతుకానికి పాల్పడ్డారని ఆమె ఆరోపించారు. వివేకా వారించినా వినకుండా జగన్ మొండిగా అవినాష్‌కే టికెట్ ఇచ్చారని, ఈ హత్యను అడ్డుపెట్టుకుని రాజకీయ లబ్ధి పొంది జగన్ ముఖ్యమంత్రి అయ్యారని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. విజయవాడలో వివేకా కేసు అంశంపై అవినాష్ రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలపై స్పందించారు.

**మీడియా ద్వారా తప్పుడు ప్రచారం**

హత్య జరిగిన సమయంలో సాక్షి మీడియా, వైఎస్ఆర్సీపీ అనుకూల వర్గాలు చేసిన ప్రచారాన్ని షర్మిల తీవ్రంగా ప్రశ్నించారు. వివేకాది సహజ మరణమని, గుండెపోటుతో చనిపోయారని సాక్షి మీడియా తొలుత వార్తలు ప్రచారం చేసిందని గుర్తు చేశారు. వివేకాను సునీత భర్తే హత్య చేసినట్లు చిత్రీకరించేందుకు అవినాష్‌రెడ్డి విశ్వప్రయత్నం చేశారు కానీ, సునీత భర్త వివేకాను సొంత తండ్రిలా చూసుకునేవారు అని ఆమె స్పష్టం చేశారు. అప్పట్లో ఈ హత్యను టీడీపీపై నెట్టి రాజకీయ పబ్బం గడుపుకున్నారన్నారు. ఇప్పుడు కూడా సునీత, ఆమె భర్తపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. వివేకా హత్య జరిగినప్పుడు హైదరాబాద్ లో ఉన్నారని గుర్తు చేశారు. సాక్ష్యాలు తుడిచేయడమే కాకుండా పోస్టుమార్టం కూడా వద్దని అవినాష్‌రెడ్డి ఎందుకు ఒత్తిడి చేశారని ప్రశ్నించారు.



**కోర్టు ద్వారానే సీబీఐ విచారణ**

నాడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు వివేకా హత్యపై సీబీఐ విచారణ కోరిన జగన్, ముఖ్యమంత్రి అయ్యాక మాత్రం సునీత ఎన్నిసార్లు ప్రాధేయపడినా ఎందుకు అంగీకరించలేదని షర్మిల ప్రశ్నించారు. ఐదేళ్లు అధికారంలో ఉండి కూడా ఈ కేసును కొలిక్కి తీసుకురావడంలో జగన్ విఫలమయ్యారని, కేవలం కోర్టు ఆదేశాల వల్లే ప్రస్తుతం సీబీఐ విచారణ జరుగుతోందని గుర్తు చేశారు. బాధితురాలు సునీత చేస్తున్న పోరాటంలో ఉన్న పట్టుదల, దర్యాప్తు సంస్థల్లో ఎందుకు కనిపించడం లేదు?" అని ఆమె నిలదీశారు.

# విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలి

**మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**బెల్లంపల్లి ,మహా:** మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా 10వ తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పరీక్షా కేంద్రాలలో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రశాంతవాతావరణంలో పరీక్షలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం జిల్లాలోని బెల్లంపల్లి పట్టణంలో గల బజార్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్షతీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 10వ తరగతి వార్షిక పరీక్షల నిమిత్తం జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, విద్యార్థుల సౌకర్యార్థం త్రాగునీరు, నిరంతర విద్యుత్ సరఫరా, వెలుతురు, ఫ్యాన్లు, మూత్రశాలలు, అత్యవసర నిమిత్తం అవసరమైన మందులు, వైద్య సిబ్బంది నియమించడం జరిగిందని, పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిజిరాక్స్ సెంటర్లు మూసి ఉంచడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. కస్తూరిబాగాంధీ బాలికలవిద్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ సంపత్ తో కలిసి సందర్శించి అదనపు తరగతి గదులు, భోజనశాల నిర్మాణ పనులను పరిశీలించి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. 9వ తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పాఠ్యాంశాలలో వారి అభ్యాసనా సామర్థ్యాలను పరీక్షించారు. విద్యార్థుల కొరకు వేసవిలో సమ్మర్ క్యాంప్ లు నిర్వహించడం జరుగుతుందని, ఈ శిబిరాలలో పాటలు, ముత్యాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాల తోపాటుచదువులో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పౌష్టికఆహారం అందించాలని, విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. రామ్ నగర్ ప్రాంతంలో నిర్మితమవుతున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నిర్మాణ పనులను సందర్శించి పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.అనంతరం కన్నెపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన 10వ తరగతి వార్షిక పరీక్షలపరీక్షా కేంద్రాన్ని సందర్శించి పరీక్ష తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పారిశుధ్య నిర్వహణ, తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించి మెనూప్రకారం విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని సూచించారు. విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలలో కల్పిస్తున్న సౌకర్యాలు, విద్యా బోధన వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి ఉద్యోగుల హాజరు పట్టికను పరిశీలించి ఉద్యోగులు, సిబ్బంది విధుల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, విధులలో సమయపాలన పాటించాలని తెలిపారు. కార్యాలయ టైపిస్ట్ ఎలాంటి సమాచారం లేకుండా విధులకు గైర్హాజరు కావడంపై షోకాజ్ నోటీసు జారీ చేయాలని అధికారిని ఆదేశించారు. మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి ప్రహరీ గోడ, భోజన శాల నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తిచేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. పాఠశాలలోని భోజనశాల ను సందర్శించి విద్యార్థులకు అందిస్తున్న మెనూ పరిశీలించి విద్యార్థులకు పౌష్టిక ఆహారం అందించాలని తెలిపారు. ఆర్.ఓ. ప్లాంట్ ను పరిశీలించి విద్యార్థులకు శుద్ధమైన త్రాగునీటిని అందించాలని, వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో**

# ఉగాది ఉత్సవ నిర్వహణ



**బెల్లంపల్లి,మహా:** బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ముందస్తుగా నిర్వహించిన శ్రీ పరాభవ నామ నూతన సంవత్సర ఉగాది ఉత్సవాలు ఉత్సాహంగా జరిగాయి. ప్రధాన ఆచార్యులు డాక్టర్ కాంపల్లి శంకర్ అనుమతి మేరకు, ఇన్చార్జి ప్రిన్సిపాల్ మేడ తిరుపతి అధ్యక్షతన తెలుగు విభాగం అధ్యాపకులు డాక్టర్ కంబాలమురళీకృష్ణ ఆధ్వర్యంలోకార్యక్రమం జరిగింది....ఆకట్టుకున్న వేదిక, వంటకాలు...ఉగాది ఉత్సవ వేడుక కోసం వేదికను విద్యార్థులు, అధ్యాపకుల సంయుక్త భాగస్వామ్యంతో అందంగా తయారు చేశారు. మామిడాకులు,వేప కొమ్మలు, వివిధ రకాల పూలతో అలంకరించారు, కొత్త కుండలో ఉగాది పచ్చడిని సిద్ధం చేశారు. పూర్ణాలు, పులిహోర, రవ్వ సిర వంటి వంటకాలు ఘుమఘుమలాడాయి. ఈ సందర్భంగా ఆయా వంటకాలను బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ,విద్యార్థులు ఆస్వాదించారు.

**అలరించిన పాటలు, కవితలు...**

ఉగాది ఉత్సవంలో వక్తల ప్రసంగాలు ఆకట్టుకున్నాయి. ఇన్చార్జి ప్రిన్సిపాల్ మేడ తిరుపతి మాట్లాడుతూ ,పండుగ గూర్చికొనియాడారు.అర్థశాస్త్రసహాయ ఆచార్యులు ఎంఏ రేష్మ మాట్లాడుతూపండుగలో అందరూ భాగస్వామ్యం అవ్వడం ఆనందంగా ఉందన్నారు. ఉగాది ఉత్సవ ప్రాశస్త్యాన్ని అధ్యాపకులు రఫిక్ తెలియజేశారు.అధ్యాపకులు గజెల్లి మోహన్, సూపరింటెండెంట్ పుప్పాల శ్రీనివాస్,సీనియర్ అసిస్టెంట్లు వెంకటేశ్వర్లు,లింగయ్య తదితరులు అధ్యాపకులకు,విద్యార్థిని,విద్యార్థులకు అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమ నిర్వహణ కర్త డాక్టర్ కంబాలమురళీకృష్ణ అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు.విద్యార్థిని గాయత్రి కవిత్వం చదివి వినిపించగా అధ్యాపకులు అల్లంతిరుపతి పాట ఆలపించారు.ఈ కార్యక్రమంలో ఇన్చార్జి ప్రిన్సిపాల్ మేడ తిరుపతి, కార్యక్రమ నిర్వహణ కర్త, తెలుగు విభాగ అధ్యాపకులు డాక్టర్ కంబాల మురళీకృష్ణ,సూపరింటెండెంట్ పుప్పాల శ్రీనివాస్,సహాయ ఆచార్యులు,అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వినియోగానికి "నో" చెప్పండి

**సహాయ పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి సిహెచ్ వీరేష్**

**మంచిర్యాల, మహా :** సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగానికి "నో" చెప్పాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ సంస్థ సహాయ పర్యావరణ ఇంజనీర్, నోడల్ అధికారి సిహెచ్ వీరేష్ అన్నారు. 99 రోజుల ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఎస్. ఆర్.కె.ఎం. డి. ఈడి. కళాశాలలో “సే నో టు సింగిల్ యూజ్ ప్లాస్టిక్” పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వలన పర్యావరణానికి హాని కలుగుతుందని, భూమి, నీరు, జీవ వ్యవస్థలకు నష్టం కలుగుతుందని తెలిపారు. నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు పాటించవలసిన నియమాలు, ప్రత్యామ్నాయ మార్గాలపై ఆయన క్లుప్తంగా వివరించారు. పర్యావరణాన్ని కాపాడడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్, కరెస్పాండెంట్, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు కార్యాలయ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే శిక్ష తప్పదు

**మంచిర్యాల జిల్లా వైద్యాధికారి అనిత హెచ్చరిక**



**మంచిర్యాల మహా :** లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే శిక్ష తప్పదని మంచిర్యాల జిల్లా వైద్యాధికారి అనిత హెచ్చరించారు. బుధవారం మంచిర్యాల జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో జిల్లా స్థాయి సలహా కమిటీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లాలో వివిధ స్కానింగ్ కేంద్రాలు, స్త్రీ వైద్య నిపుణుల దగ్గర పని నిర్వహిస్తున్న స్కానింగ్ వైద్యులు సహాయక సిబ్బందితో ఆసుపత్రులలో ఉన్న స్కానింగ్ మిషన్ల ద్వారా అందిస్తున్న వైద్య సేవల పైన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, అడగడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. భేటీ బచావో బేటి పడావో కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా గర్భిణీల పర్యవేక్షణ, అల్ట్రా సౌండ్ స్కానింగ్ మిషన్ల పర్యవేక్షణ, తనిఖీలు, రికార్డులు, సి సెక్షన్ ఆడిట్, తల్లులకు మహిళా సంఘాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె వెల్లడించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ లో లింగ నిర్ధారణ పిసిపి యాంటీ యాక్ట్ పుస్తకము, స్కానింగ్ మిషన్ల వివరాలు ప్రదర్శించాలని చెప్పారు. స్కానింగ్ కేంద్రంలో ఎలాంటి ఫోటోలు ఉండరాదని, స్కానింగ్ కు వచ్చే గర్భిణులకు సౌకర్యములు కల్పించాలని అన్నారు. లింగ నిర్ధారణ పైన అవగాహన కార్యక్రమాల గోడ ప్రతులను అతికించాలని ఆమె ఆదేశించారు. ఆసుపత్రి సర్టిఫికెట్లు, సేవల సంబంధిత రుసుముల వివరాలు గోడపై ప్రదర్శించాలని తెలిపారు. నూతన స్కానింగ్ మెషిన్ కొనడానికి ముందుగానే నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవాలని వివరించారు. పాత మిషన్ తీసివేయాలన్నా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ నుండి సర్టిఫికెట్ తీసుకోవాలని తెలిపారు. జిల్లాలో భ్రూణ హత్యల నివారణకు కమిటీ సభ్యులందరూ సహకారం అందించాలని పేర్కొన్నారు. స్కానింగ్ కేంద్రాలను సందర్శించి లోపాలు ఉన్న వారికి మెమోలు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. అనంతరం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో నిర్వహిస్తున్న వైద్య శిబిరములలో లింగ నిర్ధారణ పరీక్షల పైన అవగాహన కార్యక్రమాల సంబంధిత గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ అరుణశ్రీ, డాక్టర్ ప్రసాద్, సుధాకర్, కమిటీ సభ్యులు రాజ్ కిరణ్, రాంప్రసాద్, ప్రశాంతి, సీనియర్ అసిస్టెంట్ హారిక, లింగారెడ్డి, లక్ష్మణస్వామి, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్, జిల్లా పౌర సంబంధాల శాఖ సిబ్బంది సంపత్, వైద్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నాయకుల ముందస్తు అరెస్టులు దారుణం

**సేవాలాల్ సేన సభ్యులు**




**మణుగూరు, మహా :** గిరిజన సమస్యల పరిష్కారానికి సంబంధించి హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించనున్న రౌండ్ టేబుల్ సమావేశానికి పిలుపునిచ్చిన నేపథ్యంలో మణుగూరులో సేవాలాల్ సేన నాయకుల ముందస్తు అరెస్టులు ఉద్రిక్తతకు దారి తీశాయి. సేవాలాల్ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బాణోత్ హుస్సేన్ నాయక్ పిలుపు మేరకు సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతున్న తరుణంలో మణుగూరు మండల కమిటీ నాయకులను పోలీసులు బుధవారం ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ చర్యలను మండల సేవాలాల్ సేన అధ్యక్షుడు రవి కుమార్ నాయక్ తీవ్రంగా ఖండించారు. అరెస్టులతో ఉద్యమాన్ని అణచివేయలేరని, గిరిజనుల సమస్యలపై పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గిరిజనుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన కార్యక్రమాలను అడ్డుకోవడం తగదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మీర నిర్మల, నియోజకవర్గ గౌరవ అధ్యక్షుడు ఇస్లావత్ కోటియ, మహిళా అధ్యక్షురాలు ద్వాలి, మహిళా ఉపాధ్యక్షురాలు గూగులోత్ కవిత తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధికి చిరునామా నవ లిమిటెడ్

- ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీరామ్
- శిక్షణ పూర్తి చేసుకున్న వారికి యోగ్యత పత్రాల ప్రధానం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** నవ లిమిటెడ్ సేవలు.. నిరుద్యోగ యువతకు గొప్ప వరమని ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ శ్రీరామ్ అన్నారు. పాల్వంచ నవ లిమిటెడ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా నవ ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ నందు ఏర్పాటు చేసిన వెల్డర్, ఫిట్టర్, ఎలక్ట్రికల్ సోలార్ కోర్సులలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు యోగ్యత పత్రాల ప్రధాన బహుకరణ కార్యక్రమం బుధవారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిస్ట్రిక్ట్ ఎంప్లాయమెంట్ ఆఫీసర్ కె.శ్రీ రామ్ మాట్లాడుతూ నవ లిమిటెడ్ ఆధ్వర్యంలో అత్యాధునిక పరికరాలతో నిర్వహిస్తున్న ఈ వృత్తి విద్యా శిక్షణ కేంద్రం ఈ ప్రాంత నిరుద్యోగ యువతకు గొప్ప వరమని ఈ అవకాశం ఉపయోగించుకొని భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని కోరారు. అనంతరం మేనేజర్ సి.ఎస్.ఆర్ సి హెచ్.శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ లో ఇప్పటివరకు 2000 మందికి పైగా వివిధ కోర్సులు శిక్షణ పూర్తి చేసుకున్నట్లు తెలిపారు వీరికి సింగరేణి, కేటీపీఎస్, బీహెచ్ఈఎల్ వంటి ప్రముఖ సంస్థలలోనూ అలాగే కిర్బీబిల్డింగ్స్, ఎంటార్, హెరిటేజ్ మొదలైన ప్రైవేట్ సంస్థలలో కూడా ఉద్యోగ అవకాశాలు లభించాయి అని తెలిపారు. వెల్డర్ లో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థి ఎన్.సాయిబాబు మాట్లాడుతూ తనకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడిందని శిక్షణానంతరం వెమ్ టెక్నాలజీస్ నందు నెలకు 18వేల వేతనంతో ఉద్యోగం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ.గిరిధర్ బాబు డి.జి.ఎమ్, రమేష్ డి.జి.ఎమ్, యు.ఎస్.ఎన్. శర్మ, బిన్ను, సాయి, శ్రావణ్, శ్యాం, మహేష్, సాయిబాబు, ఉదయ్ కుమార్ అలీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# వర్మీ కంపోస్ట్‌పై అవగాహన



**బూర్గంపహాడ్ మహా :** ఇరవెండి గ్రామపంచాయతీ పరిధిలో ఈరోజు జరిగిన స్వచ్ఛ సర్వేక్షన్ మిషన్ గ్రామీణ్ లో భాగంగా పాల్వంచ డిగ్రీ కాలేజ్ విద్యార్థులకు తడి చెత్త పొడి చెత్త ప్రమాదకర చెత్త మరియు వర్మి కంపోస్ట్ ఎలా తయారవుతుంది అనే విషయం మీద అవగాహన కల్పించడం జరిగింది. ఈ అవగాహనలో భాగంగా గ్రామపంచాయతీ కార్యాలయం నుంచి డంపింగ్ షెడ్ వరకు ర్యాలీగా వెళ్లి డంపింగ్ షెడ్ లో వర్మి కంపోస్ట్ తయారు గురించి సింగిల్ యూస్ ప్లాస్టిక్ వల్ల కలిగే నష్టాలు గురించి తడి చెత్త పొడి చెత్తను వేరు చేయడం గురించి ఎస్పీఎం నుంచి వచ్చిన రేవతి గారు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ రవి గారు బూర్గంపాడు ఎంపీడీవో జమాల్ రెడ్డి గారు గ్రామపంచాయతీ సర్పంచ్ గుండి బాబురావు, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు, పాలకవర్గం సభ్యులు దుర్గ, లక్ష్మి, బత్తుల శిరీష, కరం సామ్రాజ్యం, కార్యదర్శి స్పందన, ఏపీఓ, ఈసీ టి ఏ లు ఎఫ్ఎలు, కళాశాల ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ మల్టీపర్పస్ వర్కర్స్ పాల్గొనడం జరిగింది.

# పట్టించుకోని అధికారులు.. ప్రమాదంలో విద్యార్థులు



**మహా :సంగారెడ్డి ప్రతినిధి :** సదాశివపేట మండలంలోని నాగులపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల శిథిలావస్థకు చేరి ప్రమాదకరంగా ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడంలేదని నాగులపల్లి సర్పంచ్ విజయలక్ష్మి శివానందం గౌడ్ ఆరోపించారు. మంగళవారం నాడు కురిసిన వర్షానికి పాఠశాల అదనపు తరగతి గదులు పెచ్చులు ఊడడంతో పాటు మూత్రశాలలు కూలిపోయాయని ఆమె పేర్కొన్నారు. ఈ విషయమై ప్రజావాణిలో రెండు మూడు సార్లు కలెక్టర్ గారి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నూతన అదనపు తరగతి గదులు, మూత్రశాలలు నిర్మాణంలో అధికారులు చొరవ చూపలేదని విజయలక్ష్మి గారు ఆరోపించారు. గ్రామంలో పాఠశాల అదనపు తరగతులు శిథిలావస్థలో ఉండటం వల్ల విద్యార్థులు పాఠశాలకు పంపడానికి తల్లిదండ్రులు వెనుకంజ వేస్తున్నారని వర్షం పడితే చాలు విద్యార్థుల హాజరు శాతం తగ్గుతుందని ఆమె పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు స్పందించి నాగులపల్లి గ్రామంలో పాఠశాల అదనపు తరగతి గదులు వెంటనే నిర్మాణం చేపట్టాలని ఆమె విజ్ఞప్తి చేశారు

## ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యకి ఘన స్వాగతం



**బూర్గంపహాడ్ మహా** తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య మూడు రోజుల పర్యటనలో భాగంగా బుధవారం నాడు సారపాక లోని బిపిఎల్ గెస్ట్ హౌస్ చేరుకున్నారు. బిపిఎల్ గెస్ట్ హౌస్ కు చేరుకున్న ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య బృందానికి డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఎస్సీ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీమతి శ్రీలత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఉపేందర్ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బూర్గంపాడు తాసిల్దార్ రామకృష్ణ ప్రసాద్, దమ్మపేట ఏ టి డి ఓ చంద్రమోహన్, భద్రాచలం ఏ ఎస్ డబ్ల్యూ హనుమంతరావు, ఏ ఎస్ డబ్ల్యూ ఓ/హెచ్ డబ్ల్యు ఓ పాల్వంచ సి హెచ్ అక్షయ్ మరియు గిరిజన సంక్షేమ శాఖ, ఎస్సీ కార్పొరేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆలస్యం వద్దు తక్షణమే పరిష్కరించండి

- ప్రాతినిధ్య కార్మిక సంఘం (ఐఎన్‌టియూసి) నాయకుల సూచన
- సింగరేణి కార్పొరేట్ ఆఫీసులో నిర్మాణాత్మక స్ట్రక్చర్ సమావేశం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:** సింగరేణి ఉద్యోగుల కార్మికుల సమస్యల విషయంలో ఆలస్యం చేయకుండా తక్షణమే పరిష్కరించాలని ప్రాతినిధ్య కార్మిక సంఘం(ఐఎన్‌టియూసి) నాయకులు సూచించారు. సింగరేణి ప్రధాన కార్యాలయంలో జిఎం(పర్సనల్) ఐఆర్ అండ్ పిఎం ఛాంబర్ నందు బుధవారం సింగరేణి సంస్థ కార్పొరేట్ ఏరియా పరిధిలోని వివిధ డిపార్ట్మెంట్లకు సంబంధించిన సమస్యల గురించి జిఎం(పర్సనల్)కవితా నాయుడు అధ్యక్షతన ప్రాతినిధ్య కార్మిక సంఘం (ఐఎన్‌టియూసి)నాయకులతో నిర్మాణాత్మక స్ట్రక్చర్ సమావేశం నిర్వహించారు. మెయిన్ వర్క్‌షాప్‌లో మురుగునీటి వ్యవస్థకు మరమ్మత్తులను నిర్వహించి నీరు నిలవ కుండా చేసి పరిశుభ్రంగా ఉండేలా చూడాలని యూనియన్ నాయకుల పేర్కొన్నారు. సెంట్రల్ వర్క్‌షాప్ లోపల క్వాలిటీ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ షెడ్ నుండి గేట్ వరకు అంతర్గత రహదారి నిర్మాణం చేపట్టాలని సూచించారు. కొత్తగా నిర్మించిన ఎం సి క్వార్టర్ల కేటాయింపు ప్రక్రియలో ఇల్లు కోల్పోయిన వారికి(ప్రాజెక్టు వల్ల స్థానభ్రంశం చెందిన వారికి)ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఉద్యోగులకు న్యాయం జరిగేలా చూసేందుకు కొన్ని క్వార్టర్లను గ్రేడ్ వారీ సీనియారిటీకి బదులుగా సర్వీస్ వారీ సీనియారిటీ ఆధారంగా కేటాయించాలని తెలిపారు. కోతుల బెడద కారణంగా ఎంసీ, ఎండీ క్వార్టర్ల నివాసితులు తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పారు. తక్షణ నివారణ చర్యలు(వలలు వేయడం, బోనులతో పట్టుకోవడం లేదా అటవీ శాఖ సమన్వయం) చేపట్టాలని తెలిపారు. ఎలక్షన్ డ్యూటీకి వెళ్లినప్పుడు టిఏ తో పాటు డిఏ కి కూడా అర్హత ఇవ్వాలన్నారు. ఎస్టాబ్లిష్‌మాన్యువల్ ప్రకారం 15 నెలలలోపు పిల్లల తల్లులకు రెండు నర్సింగ్ బ్రేక్ పేర్కొన్నప్పటికీ దీనిని అమలు చేయడానికి ప్రస్తుతం అధికారిక స్పష్టమైన సర్క్యులర్ ఏదీ లేదన్నారు. అన్ని విభాగాలలో నర్సింగ్ బ్రేక్ విరామ విధానాలను ప్రామాణీకరించడానికి ఒక అధికారిక పరిపాలనా సర్క్యులర్‌ను జారీ చేయవలసిందిగా అభ్యర్థించారు. సెల్లార్ సమీపంలో కొత్తగా అభివృద్ధి చేసిన పార్కింగ్ ప్రదేశంలో పైకప్పు నిర్మాణాలు లేకపోవడం వల్ల వాహనాలను ఆరుబయట నిలుపుతున్నారని తెలిపారు. నిరంతరం అధిక ఉష్ణోగ్రతలకు భారీ వర్షాలకు వాహనాలు వేగంగా పాడవుతున్నాయి అని ఇనుప ఫ్రేమ్ షెడ్ల నిర్మాణం కోసం సంబంధిత వారికి సలహా ఇవ్వవలసిందిగా సూచించారు. సింగరేణి ప్రధాన కార్యాలయ గేట్ వద్ద పైకప్పుపై ఒక షెల్టర్‌ను నిర్మించవలసిందిగా కోరారు. భద్రతా సిబ్బంది ప్రస్తుతం తీవ్రమైన వేడిలో పనిచేస్తున్నారు వారి ఆరోగ్యానికి కార్యాచరణ సామర్థ్యానికి ఇండోర్ కప్పు ఉన్న పోస్ట్ చాలా అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వర్క్‌షాప్ ఉద్యోగులకు "మైన్ షూస్" జారీ చేయబడుతున్నాయి అయితే కార్పొరేట్ వర్క్‌షాప్‌లలో పని చేసే తీరును దృష్టిలో ఉంచుకుని వాటికి బదులుగా ఓసీ (ఓపెన్ కాస్ట్) ప్రాజెక్ట్ షూస్‌ను అందించవలసిందిగా అభ్యర్థించారు. పీడియాట్రిక్ వార్డులో పిల్లలు బెడ్ పై నుండి కింద పడకుండా నిరోధించడానికి ఒక కీలకమైన భద్రతా చర్యగా పీడియాట్రిక్ వార్డులో సైడ్ గార్డులతో కూడిన పడకలను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలో ప్రాథమిక సౌకర్యాన్ని నిర్ధారించడానికి రోగి సహాయకుల కోసం ప్రస్తుతం ఉన్న చెక్క పడకలను మెత్తని స్పాంజ్ పడకలతో మార్చాలని సూచించారు. పైన పేర్కొన్న అంశాలపై సుదీర్ఘముగా సమీక్షించి సంస్థ పరిధిలో ఉన్న మేరకు వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని జిఎం(పర్సనల్)ఐఆర్ పిఎం వెల్ఫేర్ కవితా నాయుడు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాతినిధ్య సంఘం (ఐఎన్‌టియూసి)కార్పొరేట్ వైస్ ప్రెసిడెంట్ పితాంబరరావు, ఏసిఎంఓ ఎం.ఉష, ఏజిఎం(ఐఈ) సిహెచ్.వెంకయ్య, ఏజిఎం(పర్సనల్) జి.రాజేంద్ర ప్రసాద్, ఏజిఎం(పర్సనల్) ఐఆర్ వింగ్ కే.అజయ్ కుమార్, డిజిఎం(పర్సనల్) వెల్ఫేర్ కేసా నారాయణ రావు, ఎస్ఈ (సివిల్) రాజేంద్ర ప్రసాద్, ఎస్ఈ(సేఫ్టీ) ఎం.నరేందర్, జూనియర్ ఇన్స్పెక్టర్ డి.నారాయణ రెడ్డి, ఐఎన్‌టియూసి కార్పొరేట్ ప్రతినిధులు సంజయ్, లలిత లక్ష్మి, ఇతర సంబంధిత డిపార్ట్మెంట్ల అధికారులు యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 6వ వార్డులో ఇఫ్తార్ విందు

**పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతా సాయినాథ్**



**మహా :సంగారెడ్డి ప్రతినిధి :** సదాశివపేట పట్టణంలోని 6వ వార్డు కృష్ణానగర్ కాలనీలో బుధవారం వార్డు కౌన్సిలర్ నాగుల మానెమ్మ బీఆర్ఎస్ నాయకులు నాగుల విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లిం సోదరులకు సోదరీమణులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం జరిగింది. ఇఫ్తార్ ఈ దావత్ లో టిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింత సాయినాథ్ పాల్గొని ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులకు పండ్లు పానీయాలు అందించారు. ప్రజలంతా కులమతాలకతీతంగా పండుగ వాతావరణం లో గడపడం రంజాన్ మాసంతోనే సాధ్యమవుతుందన్నారు. పెద్దల పట్ల గౌరవం, తల్లిదండ్రులు, గురువుల పట్ల భక్తి, సమాజం పై శ్రద్ధ అల్లాహ్ చూపిన మార్గాలని చింత సాయినాథ్ పేర్కొన్నారు. అరవ వార్డ్ కౌన్సిలర్ నాగుల మణెమ్మ, బీఆర్ఎస్ నాయకులు నాగుల విజయకుమార్ అను నిత్యం ప్రజల్లో ఉంటూ వారి బాగోగులను చూస్తూ వార్డు అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని చింత సాయినాథ్ తెలిపారు. కార్యక్రమంలో...

## నవోదయ ఎంట్రన్స్ పరీక్షలో మరోసారి సత్తా చాటిన ఎక్స్ లెంట్ భాషా హై స్కూల్ విద్యార్థిని




**పినపాక,మహా:** నవోదయ ఎంట్రన్స్ పరీక్షలో ఈ బయ్యారంలో గల ఎక్స్ లెంట్ భాషా హై స్కూల్ విద్యార్థిని శేరు వేదాన్సిక అత్యంత ప్రతిభ కనబరచి 17వ ర్యాంకును సొంతం చేసుకొని, ఆరవ తరగతికి సీటు సాధించారని ఎక్స్ లెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్ తెలిపారు. సీటు సాధించినందుకు పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు విద్యార్థినిని అభినందిస్తూ సత్కరించారు .ఈ సందర్భంగా ఎక్స్ లెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ మారుమూల ఏజెన్సీ ప్రాంతంలో ఉన్న సాధారణ విద్యార్థులకు ఎంట్రన్స్ పరీక్షలలో సత్తా చాటేలా నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సలెంట్ విద్యా సంస్థల డైరెక్టర్లు ఖాదర్ షరీఫ్, యాకూబ్ షరీఫ్, ముక్కు నరసారెడ్డి, బందారు నరేంద్ర, ప్రిన్సిపాల్ అంకం సురేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నవోదయ పరీక్ష ఫలితాల్లో పినపాక మండల విద్యార్థుల ప్రతిభ



**పినపాక, మహా:** నవోదయ పరీక్ష ఫలితాల్లో పినపాక మండల కేంద్రానికి చెందిన గనగాని ప్రవీణ్ స్రవంతి దంపతుల కుమారుడు గనగాని జస్వంత్ గౌడ్ అనే విద్యార్థి అత్యంత ప్రతిభ కనబరిచి నవోదయ సీట్ సాధించాడు.... అలాగే ఇదే మండలంలోని ఏడూళ్ల బయ్యారం గ్రామానికి చెందిన బుయ్యవరపు భాస్కర సూరి రమ్య దంపతుల కుమారుడు బుయ్యవరపు దేవి శ్రీ చరణ్ పట్టుదలతో చదివి నవోదయ ఎంట్రన్స్ లో సత్తా చాటి సీటు సాధించాడు... ఇదే మండలంలో ఐదవ తరగతి చదువుతున్న ఈ విద్యార్థులు పట్టుదలతో చదివి వేలాదిమంది పోటీపడిన ఈ ప్రవేశ పరీక్షలో సీటు సాధించారు.. నవోదయ సీటు సాధించిన ఇరువురి విద్యార్థులను కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

# ఉపాధికి చిరునామా...

## మణుగూరులో- విద్యార్థులకు ఉచిత వైద్య శిబిరం



**మణుగూరు, మహా :** ప్రజా పాలన-హెల్త్ మిషన్ కార్యక్రమంలో భాగంగా మణుగూరులోని మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ బ్యాక్వర్డ్ క్లాసెస్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూట్, ఏహెచ్ఎస్ గర్ల్స్ పాఠశాలలో దంత, కంటి, జనరల్ వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 325 మంది విద్యార్థులకు కంటి, దంత, సాధారణ జబ్బులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను అందించారు. వీరిలో 27 మంది విద్యార్థులకు దృష్టిలోపం ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. అలాగే 15 మంది విద్యార్థులు దంత సమస్యలతో బాధపడుతున్నట్లు నిర్ధారించారు. మిగిలిన విద్యార్థులు సాధారణ ఆరోగ్యంతో ఉన్నారని జనరల్ వైద్యులు తెలిపారు. శిబిరం సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరిరక్షణ, శుభ్రత, పోషకాహారం వంటి అంశాలపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులను బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ సిబ్బంది ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏరియా హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సునీల్, డాక్టర్ గౌరీప్రసాద్, నేత్ర సహాయ వైద్యాధికారి జి సంజీవరావు, ఆర్‌పీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ సాయి, ఏజీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు మహేశ్వరి, బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ ప్రిన్సిపల్ జి అనిత, నర్సింగ్ ఆఫీసర్ జ్యోతి, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

# లారీ–బొలెరో ఢీకొని ఘోర ప్రమాదం..

- ఆరుగురు రైతు కూలీలు గాయాలు..
- బాధితులను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు..



**మణుగూరు /పినపాక, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం దుగ్గినేపల్లి గ్రామ పరిధిలో బుధవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. మణుగూరు నుండి రాజుపేటకు రైతు కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం, ఎదురుగా వస్తున్న లారీని ఢీకొనడంతో ఆరుగురు కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద తీవ్రతతో వాహనం ముందుభాగం పూర్తిగా దెబ్బతింది. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పినపాక ఎమ్మెల్యే శ్రీ పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకులు ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మణుగూరు 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో గాయపడిన వారికి తక్షణ వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. అవసరమైతే మెరుగైన చికిత్స కోసం భద్రాచలం, ఖమ్మం, హైదరాబాద్ ఆసుపత్రులకు తరలించాలని వైద్య అధికారులను కోరారు. పరామర్శించిన వారిలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు పిరినాకి నవీన్, టౌన్ అధ్యక్షులు శివ సైదులు, ఏరియా హాస్పిటల్ సూపరిండెంట్ గౌరీ ప్రసాద్, మండల నాయకులు రామ్ రెడ్డి, దొడ్డపనేని మధు, చప్పిడి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

# గర్భాశయ క్యాన్సర్ నివారణకు టీకా తప్పనిసరి..

- మణుగూరులో బాలికలకు అవగాహన
- విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ సునీల్ ఆధ్వర్యంలో గర్భాశయ ముఖ క్యాన్సర్ నివారణ టీకా కార్యక్రమాన్ని బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా టీకా తీసుకున్న బాలికలకు, అర్హులైన విద్యార్థులకు టీకా ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ గర్భాశయ ముఖ క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధి నుంచి రక్షణ పొందేందుకు ఈ టీకా ఎంతో కీలకమని తెలిపారు. ముఖ్యంగా 14 నుంచి 15 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలికలు తప్పనిసరిగా ఈ టీకా తీసుకోవాలని సూచించారు. ఈ టీకా ద్వారా భవిష్యత్తులో తీవ్రమైన ఆరోగ్య సమస్యలను నివారించవచ్చని వివరించారు. అనంతరం మండలంలోని శివలింగాపురం గ్రామంలోని చిల్డ్రెన్స్ హోమ్ పాఠశాలను సందర్శించి అక్కడి పిల్లలందరికీ సంపూర్ణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి తగిన వైద్య చికిత్స అందించారు. ఈ సందర్భంగా పిల్లలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కునే విధానం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వంటి అంశాలను ప్రయోగికంగా చూపించారు. అలాగే పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు

## నిరుపేద ముస్లిం సోదరులకు

# ఈద్ రంజాన్ తోఫా పంపిణీ




**బూర్గంపహాడ్ మహా ::** పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ తోఫా పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ క్రమంలో బూర్గంపాడు తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ప్రసాద్ ఆధ్వర్యంలో, వీడీసీ హుస్సేన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మహమ్మద్ ఖాన్ సమక్షంలో మండలంలోని ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ తోఫాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ అధ్యక్షులు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మైనార్టీ మంత్రి, షబ్బీర్ అలీ, ఫహీం ఖురేషి, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, టీఎస్ ఎఫ్‌డీసీ చైర్మన్ వీరయ్య, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోట దేవి ప్రసన్నతో పాటు రాష్ట్ర, జిల్లా నాయకులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈద్ తోఫా పంపిణీతో నిరుపేద ముస్లిం కుటుంబాల్లో ఆనందం నెలకొన్నదని, ఈ సందర్భంగా అందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు

# లారీ బొలెరో ఢీ



**పినపాక, మహా:** మండల పరిధిలో ని దుగినేపల్లి పంచాయతీ కార్యాలయం వద్ద లారీ బొలెరో ఢీ కొట్టి ఆపకుండా వెళ్లిపోయిన ఘటన స్థానికంగా చోటు చేసుకుంది. బుధవారం ఉదయం సుమారు 5:30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. మణుగూరు సింగారం (రాములవారి గుడి దగ్గర) నుంచి మిర్చి కోత పనులకు కూలీలను తీసుకెళ్తున్న బొలెరో వాహనాన్ని దుగినేపల్లి వద్ద ఒక లారీ ఢీకొట్టింది. ఢీకొన్న వెంటనే లారీ డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ ప్రమాదంలో దారావత్ లక్ష్మి, మునిషాయ్యమ్మ, జి. లక్ష్మి, లకి తీవ్రంగా గాయపడి చేతులు విరిగినట్లు సమాచారం.

# పాఠశాలలో ఘనంగా ఉగాది సంబరాలు..

**సాంప్రదాయాలపై విద్యార్థుల్లో అవగాహన పెంపు..**



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలోని ఎకింలెంటి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ పైలట్ కాలనీలో బుధవారం ముందస్తు ఉగాది పండుగ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కరస్పాండెంట్ ఎండి ఖాదర్, చైర్మన్ యూసఫ్ షరీఫ్, డైరెక్టర్ యాకూబ్ షరీఫ్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి పాఠశాల ప్రాంగణాన్ని మామిడి ఆకులతో తోరణాలు కట్టి, అందమైన రంగవల్లులతో అలంకరించారు. పండుగకు అనుగుణంగా సాంప్రదాయ వాతావరణం ఉట్టిపడేలా పాఠశాలను, తరగతి గదులను అలంకరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ యూసఫ్ షరీఫ్ మాట్లాడుతూ పరాభవ నామ సంవత్సర ఉగాది పండుగ చైత్ర శుక్ల పాడ్యమి నాడు జరుపుకుంటారని తెలిపారు. ఈ పవిత్ర దినాన కొత్త పనులు ప్రారంభించడం ఆనవాయితీ అని చెప్పారు. షడ్రుచులతో కూడిన ఉగాది పచ్చడిని సేవించడం, పంచాంగ శ్రవణం వినడం వంటి సంప్రదాయాలను పాటిస్తారని వివరించారు. ప్రతి ఒక్కరూ కొత్త సంవత్సరంలో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఇలాంటి కార్యక్రమాలను పాఠశాలలో నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో సంప్రదాయాల పట్ల గౌరవం, ఐక్యత, ఆనందం పెంపొందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాటలు, నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలతో పండుగను మరింత ఉత్సాహంగా జరుపుకున్నారు.



# ‘ధురంధర్ 2’ మూవీ రివ్యూ అండ్ రేటింగ్

**సినిమా: ధురంధర్: ద రివేంజ్**
**నటీనటులు: రణ్‌వీర్ సింగ్, మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్, అక్షయ్ ఖన్నా, సారా అర్జున్ తదితరులు**
**సంగీతం: శాశ్వత్ సచ్‌దేవ్**
**సినిమాటోగ్రఫీ: వికాల్ నోవ్లఖా**
**ఎడిటర్: శివకుమార్ వి పనికర్**
**రచన-దర్శకత్వం: ఆదిత్య ధర్**
**నిర్మాతలు: జియో స్టూడియోస్, బీ62 స్టూడియోస్**
**నిడివి: 229 నిమిషాలు**
**విడుదల తేదీ: 19 మార్చి 2026**

గతేడాది డిసెంబరులో ఏ మాత్రం అంచనాల్లేకుండా వచ్చి సంచలనం సృష్టించిన సినిమా 'ధురంధర్'. సీక్వెల్ గురించి అప్పుడే క్లారిటీ ఇచ్చారు. ఇప్పుడు అదే మాటపై నిలబడి 'ధురంధర్: ద రివేంజ్'ని థియేటర్ల లోకి తీసుకొచ్చేశారు. స్పై యాక్షన్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమా రెండో భాగాన్ని హిందీతో పాటు తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేశారు. ఇంతకీ ఈ చిత్రం ఎలా ఉంది? తొలి భాగాన్ని మించిపోయిందా లేదా అనేది రివ్యూలో చూద్దాం.

### కథేంటి?


రెహమాన్ డెకాయిట్ (అక్షయ్ ఖన్నా) మరణంతో ధురంధర్ పార్ట్ 1 ముగుస్తుంది. ఆ తర్వాత ల్యారీకి తానే నాయకుడినని అర్షద్ పప్పు (అశ్విన్ ధర్)ప్రకటించుకుంటాడు. అన్నచావుకు కారణమైన అర్షద్ పప్పుపై రెహమాన్ సోదరుడు ఉజెయిర్ బలోచ్(దానిష్) కోపంతో రగిలిపోతుంటాడు. వీరిద్దరిని కాదని, ల్యారీని భారత సీక్రెట్ ఏజెంట్ హమ్జా(రణ్‌వీర్ సింగ్) తన గుప్పింట్లోకి తెచ్చుకొని, భారత ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ అజయ్ సన్యాల్(మాధవన్) అప్పజెప్పిన పనులన్నీ పూర్తి చేసుకొస్తుంటాడు. పాకిస్తాన్ మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్), ఎంపీ జమీల్ (రాకేష్ బేడీ) కూడా హమ్జాని గుడ్డిగా నమ్ముతారు. ఇలా పాక్ ఉగ్రవాద నాయకులందరిని నమ్మించి.. ఇండియాపై వాళ్లు చేసే కుట్రలన్నింటిని హమ్జా తిప్పికొడతాడు. అసలు భారత్‌పై పాక్ ఉగ్రవాద సంస్థలు చేసిన కుట్రలు ఏంటి? వాటిని తిప్పికొట్టే క్రమంలో హమ్జాకు ఎదురైన సమస్యలు ఏంటి? హమ్జా ఇండియన్ ఏజెంట్ అనే విషయం ఎలా బయటకు వచ్చింది? ఆ విషయం తెలిసిన తర్వాత మేజర్ ఇక్బాల్ (అర్జున్ రాంపాల్) ఏం చేశాడు?. పాకిస్తాన్‌లోని ఉగ్రవాద ముఠాలందరికి మార్గనిర్దేశం చేస్తున్న ‘బడే సాహెబ్ ’ ఎవరు? ఆపరేషన్ ధురంధర్ కోసం ఇంటెలిజెన్స్ బ్యూరో చీఫ్ అజయ్ సన్యాల్.. పంజాబ్‌లో జైలు జీవితం గడుపుతున్న జస్కరిత్ సింగ్ రంగీ(రణ్‌వీర్)నే ఎందుకు ఎంచుకున్నాడు? అతని నేపథ్యం ఏంటి? ఇతని కుటుంబానికి ఎమ్మెల్యే సుఖ్వేంధర్ చేసిన అన్యాయం ఏంటి? అనేది తెలియాలంటే సినిమా చూడాల్సిందే.

### ఎలా ఉందంటే..

ఉగ్రవాదాన్ని అంతం చేయడానికి ఒక జైలు ఖైదీని సీక్రెట్ ఏజెంట్‌గా పాకిస్తాన్‌కి పంపడం అనే కొత్త పాయింటే ధురంధర్ విజయానికి కారణం అయింది. ఇంతవరకు వచ్చిన స్పై యాక్షన్ సినిమాలకు ధురంధర్‌కు మత్య ఉన్న తేడా అదే. దానికి తోడు యాక్షన్ సన్నివేశాలు, బీజీఎం అదిరిపోవడంతో రికార్డు స్థాయి కలెక్షన్స్ వచ్చాయి. ఆ చిత్రానికి కొనసాగింపుగా వచ్చిన ధురంధర్ : ది రివెంజ్ కూడా అదే రేంజ్‌లో ఆకట్టుకునేలా తీర్చిదిద్దారు. యాక్షన్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో పాటు ఎమోషన్‌కి కూడా పెద్ద పీట వేశారు. పార్ట్ 1 చూసిన వాళ్లు సినిమా ప్రారంభం నుంచే ధురంధర్ ప్రపంచంలోకి వెళ్లిపోతారు. చూడనివారికి కూడా కథను చాప్టర్ల వారిగా విడగొట్టి.. అర్థమయ్యేలా తెరపై చూపించాడు దర్శకుడు. అయితే పార్ట్ 1 చూస్తేనే కొన్ని పాత్రలకు తాలుకు పవర్ తెలిసి..తర్వాత ఏం జరుగుతుందో ఊహించొచ్చు.చివరిలో వచ్చే కొన్ని ట్విస్టులను మాత్రం ఊహించలేం. అవి థ్రిల్‌కి గురి చేస్తాయి. పార్ట్ 1 కంటే నిడివి ఎక్కువైనా.. ఎక్కడా బోర్ కొట్టదు. హమ్జా పాత్ర ఫ్లాష్‌బ్యాక్‌తో సినిమా కథ ప్రారంభం అవుతుంది. తన కుటుంబానికి జరిగిన అన్యాయంపై హీరో పగ తీర్చుకునే క్రమంలో వచ్చే సన్నివేశాలు అయితే ఒళ్లు జలదరించేలా ఉన్నాయి. అక్కడ నుంచి మొదలు సినిమా ఎండింగ్ వరకు యాక్షన్ సీన్స్‌ను ఓ రేంజ్‌తో తీర్చిదిద్దారు. ల్యారీ పీఠం దక్కించుకునేందుకు హమ్జా ఆడే మైండ్ గేమ్ అదిరిపోతుంది. ఉగ్రవాదులకు అంతం చేసేందుకు వేసే ఎత్తులు థియేటర్స్‌లో చప్పట్లు కొట్టించేలా ఉంటాయి. 2016లో జరిగిన నోట్ల రద్దు ఘటనను కూడా ఈ కథలో ప్రస్తావించారు. నోట్ల రద్దు సరైన నిర్ణయం అనేలా ఈ చిత్రంలో చూపించారు. అలాగే మాఫియా డాన్ దావూద్‌ని కూడా ఈ కథకు ముడిపెట్టడం ఆసక్తిరేకెత్తించే అంశం. ఫస్టాఫ్ వరకు కాస్త స్లోగా అనిపించినా.. ఇంటర్వెల్ ట్విస్ట్ మాత్రం అదిరిపోతుంది. ద్వితియార్థంలో ఏం జరుగుందా అనే ఆసక్తిని ప్రేక్షకులను కలిగించేలా ఇంటర్వెల్ కట్ చేశారు. ఇక సెకండాఫ్ మొత్తం కథనం పరుగులు పెడుతుంది. హమ్జాపై ఎస్పీ అస్లాం చౌదరిపై అనుమానం రావడంతో కథనంపై ఆసక్తి పెరుగుతుంది. హమ్జా భారత ఏజెంట్ అని తెలిసిన తర్వాత ఏం జరుగుతుందా అనే క్యూరియాసిటీ ప్రేక్షకుల్లో కలుగుతుంది. ఇక చివరి 30 నిమిషాల్లో వచ్చే ట్విస్టులు అదిరిపోతాయి. క్లైమాక్స్ ఎమోషనల్‌గా సాగుతుంది.

### ఎవరెలా చేశారంటే..

సీక్రెట్ ఏజెంట్ హమ్జా పాత్రలో రణ్‌వీర్ సింగ్ ఒదిగిపోయాడు. యాక్షన్ సీన్లతో పాటు ఎమోషనల్ సన్నివేశాల్లోనూ అదరగొట్టేశాడు. పాకిస్తాన్ మేజర్ ఇక్బాల్‌గా అర్జున్ రాంపాల్ అద్భుతంగా నటించాడు. ఎస్పీ చౌదరిగా నటించిన సంజయ్ దత్ నిడివి కాస్త తక్కువే. ఆయన పాత్ర ముగింపు బాగుంటుంది. ఐబీ చీఫ్ అజయ్ సన్యాల్‌గా మాధవన్ తెరపై కనిపించేది తక్కువే అయినా.. గుర్తిండిపోయేలా నటించాడు. జమీల్ జమాల్‌గా నటించిన రాకేశ్ బేడి నవ్వులు పూయించడంతో పాటు థ్రిల్లింగ్‌కి కూడా గురిచేశాడు. సారా అర్జున్ పాత్రకు పెద్దగా ప్రాధాన్యత లేదు. మిగిలినవారంతా బాగానే చేశారు. సాంకేతికంగా సినిమా చాలా బాగుంది. శాశ్వత్ సచ్‌దేవ్ బీజీఎం ఈ సినిమాకు మరో ప్రధాన బలం. తనదైన నేపథ్య సంగీతంతో కొన్ని సీన్లకు ప్రాణం పోశాడు. పోరాట ఘట్టాలు వాస్తవికంగా తెరకెక్కించారు. సినిమాటోగ్రఫీ బాగుంది. ఎడిటింగ్ పర్వాలేదు. నిర్మాణ విలువలు బాగున్నాయి.



# శర్వానంద్ జోడీగా?

ఒకప్పుడు తెలుగులో ఓ వెలుగువెలిగిన కన్నడ భామ పూజాహెగ్డే గత ఐదేళ్లుగా రేసులో పూర్తిగా వెనకబడింది. టాలీవుడ్‌లో పూర్వ వైభవం కోసం ఎదురుచూస్తున్న ఈ సొగసరికి ప్రస్తుతం పరిస్థితులు ఆశాజనకంగా కనిపిస్తున్నాయి. తెలుగులో దుల్కర్ సల్మాన్‌తో కలిసి ఆమె ఓ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా వుండగా ఈ భామ తెలుగులో మరో బంపరాఫర్‌ను దక్కించుకున్నట్లు తెలిసింది. శర్వానంద్ కథానాయకుడిగా సీనియర్ దర్శకుడు శ్రీను వైట్ల ఓ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. ‘జార్జ్ క్రిష్’ అనే టైటిల్ ప్రచారంలో ఉంది. ఇందులో పూజాహెగ్డే కథానాయికగా నటించనుందని సమాచారం. కథానుగుణంగా ఇద్దరు నాయికలకు చోటుందని, ఇప్పటికే రుక్మిణి వసంత్ పేరును ఖరారు చేయగా, మరో కథానాయికగా పూజాహెగ్డే వైపు చిత్రబృందం మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. త్వరలో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్లనుంది.



# మైసా.. వేట మొదలైంది!

అగ్ర తారలు విజయ్ దేవరకొండ-రష్మిక మందన్న ఇటీవలే వివాహబంధంతో ఒక్కటైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరి పెళ్లి వేడుక వైభవంగా జరిగింది. దాదాపు రెండు వారాల పాటు వెడ్డింగ్ సెలబ్రేషన్స్‌లో బిజీగా ఉన్న రష్మిక మందన్న తిరిగి సెట్స్‌లోకి అడుగుపెట్టింది. తాజాగా ఆమె పీరియాడిక్ యాక్షన్ థ్రిల్లర్ ‘మైసా’ షూటింగ్‌లో జాయిన్ అయ్యింది. ఈ సినిమాలో రష్మిక మందన్న గోండు తెగకు చెందిన యోధురాలి పాత్రలో కనిపించనుంది. కెరీర్‌లో తొలిసారి రష్మిక మందన్న ఫుల్‌లెంగ్త్ యాక్షన్ రోల్‌ని చేస్తుండటం ప్రాధాన్యతను సంతరించుకుంది. ప్రస్తుతం షూట్‌లో భాగంగా ఆమెపై యాక్షన్ సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. హాలీవుడ్ స్టంట్ మాస్టర్ ఆండీలాంగ్ నేతృత్వంలో ఈ ఎపిసోడ్‌ని తెరకెక్కిస్తున్నట్లు తెలిసింది. ‘మైసా’ చిత్రీకరణ తాలూకు ఫొటోను అభిమానులతో పంచుకుంది రష్మిక మందన్న. దీనికి ‘వేట మొదలైంది’ అనే క్యాప్షన్‌ను జత చేసింది. రవీంద్ర పుల్లె దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో విడుదలకానుంది.

EDITOR, PRINTER,PUBLISHER AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, PRINTED AT 19-12-458, BAIRAGIPATTEDA, TIRUPATHI - 517501, A.P., REGD NO : APTEL/2014/58382. PH NO : 6300992296, Email : mahapathrika2003@gmail.com.
PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. Corporate Office : 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana, IN - 500034